క్లుప్తంగా

దుర్గమ్మ ఆలయానికి భూమి పూజ



దుగ్గొండి : మండలంలోని రాజ్యాతండాలో దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆలయాలు ఐక్యత చిహ్నాలుగా ఉంటాయని, భక్తిభావం పెంపొందిస్తాయని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కిరణ్‌రెడ్డి, రాజేశ్వర్ రావు, నర్సింగరావు, నాయకులు మట్ట రాజు, దంజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



నర్సంపేట : శ్రీ కృష్ణాష్టమి ముగింపు వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెన్నారావుపేటలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను శుక్రవారం వేడుకగా ఊరేగించారు. భక్తులు శ్రీకృష్ణుడిని పూజించారు. మండల కేంద్రంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ ఆచారి, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, ప్రతినిధులు కిరణ్, శరత్, హనుమయ్య, కట్టయ్య, రావణ ఆచారి, పద్మ, విక్రమ్, కానిస్టేబుల్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలో ఏర్పాటు చేసిన మారెమ్మ తల్లి విగ్రహాన్ని మోతె శివునిట్ల గోత్ర వంశస్తులు శుక్రవారం ఘనంగా ప్రతిష్ఠించారు. తొలుత అమ్మవారి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి చల్లంగా మొక్కుకున్నారు. కార్యక్రమంలో భక్తులు తిరుపతిరెడ్డి, మోతె సంపత్‌రెడ్డి, మోతె నరేందర్‌రెడ్డి, మోతె ఇంద్రసేనారెడ్డి, మోతె రాజశేఖర్‌రెడ్డి, మోతె వేణు, ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మోతె కిరణ్‌రెడ్డి, డాక్టర్ మోతె నవత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



వర్ధన్నపేట : స్థానిక ఎస్సైగా ఎస్.సాయిబాబు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన చందర్ టాస్క్ ఫోర్స్ విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ముల్కనూర్‌లో ఎస్సైగా పని చేసిన సాయిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై సాయిబాబు మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా పని చేస్తానని తెలిపారు.

బస్టాండ్‌లో నిరసన



నెక్కొండ : స్థానిక బస్టాండ్ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షురాలు నాయిని అనూష అశోక్ మాట్లాడారు. వర్షాలతో బస్టాండ్ ప్రాంగణం బురదమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీటిని, బురదను తొలగించి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు దామరచర్ల రామారావు, నాయకులు శ్రీరంగం సంపత్, సూదనపు సారయ్య, రాంపెల్లి రాజగోపాల్, మల్లం మల్లేశ్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సబ్బులు, శానిటైజర్ల పంపిణీ

నల్లబెల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు జీసస్ గాస్పెల్ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ మత్తయ్య శుక్రవారం సబ్బులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని తెలిపారు. కార్మికులను ప్రజలు గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, పాస్టర్ మహేందర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు పరికి కోర్నెల్, తదితరులు పాల్గొన్నారు.

ఐపీ సేవల ప్రారంభమెప్పుడో?

- నూతన ఆస్పత్రి భవనంలో సేవల కోసం ఎదురుచూపులు
- సిబ్బంది కొరత, ఇతర సమస్యలతో జాప్యం



ఐపీ సేవల కోసం సిద్ధం చేసిన ఆస్పత్రిలోని బ్లాక్‌–ఏ భవనం

నర్సంపేట రూరల్ : నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల భవనాలను గతేడాది మంత్రులు ప్రారంభించిన విషయం తెలిసిందే. నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నూతన భవనంలో ఐపీ (ఇన్ పేషంట్లకు)సేవలు ఎప్పుడు ప్రారంభిస్తారో? అని రోగులు, అటెండెంట్లు ఎదురు చూస్తున్నారు. పాత ఆస్పత్రి భవనంలో 80 పడకలున్నా సరిపోకపోవడంతో రోగులకు వరండాలోనే చికిత్స అందిస్తున్న దుస్థితి నెలకొంది. అలాగే సమాధానం చెప్పలేక వైద్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. నూతన ఆస్పత్రి భవనంలోని బ్లాక్‌–ఏ 140 పడకలు సిద్ధం చేసినా ఉద్యోగుల కొరత, ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడంతో సేవలు అందించకుండా వాయిదా వేస్తున్నారు.

వర్షాకాలంలో రోగుల తాకిడి

వర్షాకాలంలో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనానికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోందని గణాంకాలు చెబుతున్నాయి. నర్సంపేట డివిజన్ పరిధిలోని ఆరు మండలాలతోపాటు వరంగల్ జిల్లాలోని సంగెం, పర్వతగిరి మండలాల, మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, ములుగు జిల్లా మల్లంపల్లి మండలం నుంచి రోగులు నర్సంపేట వస్తున్నారు. గతంలో సీజనల్ వ్యాధులు ప్రబలిన సందర్భంలో బెడ్‌కు ఇద్దరికి చొప్పున చికిత్స అందించారు. కొద్ది రోజులుగా రోగుల సంఖ్య పెరుగుతుండడంతో వరండాలోనే చికిత్స అందిస్తున్నారు. అలాగే పాత భవనం శిథిలమైంది. స్లాబ్ పెచ్చులూడుతూ రోగులను, అటెండెంట్లను బెంబేలెత్తిస్తోంది. ఉద్యోగులు, సిబ్బంది కూడా భయపడుతున్నారు.

పెరుగుతున్న రెఫరల్ కేసులు

నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనానికి నానాటికీ వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతుండడంతో సరిపడా బెడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో వైద్యులు రోగులకు సీరియస్‌గా ఉందంటూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపుతున్న రెఫరల్ కేసులు పెరుగుతున్నాయి. స్థానికంగా మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో నూతన భవనం, వైద్య కళాశాల ఏర్పాటు చేసినా పాత ఆస్పత్రి భవనంలోనే సేవలు అందించడమే కాకుండా వరంగల్‌లోని ఎంజీఎంకు పంపుతుండడంతో రోగులు, అటెండెంట్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం



ఆస్పత్రి నూతన భవనంలో ఐపీ సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. బ్లాక్‌–ఏలో ఐపీ కోసం బెడ్ల ఏర్పాటు జరుగుతోంది. నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది కొరత ఉండడంతో కలెక్టర్‌కు, వైద్య శాఖ కమిషనర్‌కు నివేదిక అందించాము. ఇప్పటికే డిప్యూటేషన్‌పై నర్సింగ్ స్టాఫ్‌ను కొంత మేరకు పంపించారు. త్వరలో ఇంకొందరు నర్సింగ్ స్టాఫ్ రానున్నారు. ఇతర సదుపాయాలు కలుగనున్నాయి. త్వరలో నూతన ఆస్పత్రి భవనంలో ఐపీ సేవలు ప్రారంభిస్తాం.

– డాక్టర్ కిషన్, ఆస్పత్రి సూపరింటెండెంట్



పాత ఆస్పత్రి భవనంలోని వరండాలో చికిత్స పొందుతున్న రోగులు

నానో యూరియా వినియోగం మేలు

- ఏడీఏ దామోదర్‌రెడ్డి



దుగ్గొండి : మాట్లాడుతున్న ఏడీఏ దామోదర్‌రెడ్డి

నర్సంపేట రూరల్/దుగ్గొండి/ఖానాపురం : పంటల సాగులో నానో యూరియా వినియోగం మేలని నర్సంపేట వ్యవసాయ శాఖ సహాయక సంచాలకుడు (ఏడీఏ) దామోదర్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం మండలాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, ఇతర పంటలపై డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేయించారు. నానో యూరియా వినియోగంతో భూసారం పెరుగుతుందని చెప్పారు. పత్తి పంటలో వర్షపు నీటిని తొలగించి లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున పాలిఫీడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొక్కల మొదళ్లకు లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి చల్లాలని చెప్పారు. మొక్కజొన్న పంటలో అధిక వర్షాలతో భాస్వరం లోపించి ఆకులు ఊదారంగు మారితే లీటరు నీటికి 5 గ్రాముల 19–19–19 పొడి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరిలో కాండం తొలిచే పురుగుల నివారణకు ఎకరాకు 4 కిలోల చొప్పున క్లోరంట్రానిలిప్రోల్ గుళికలు చల్లాలన్నారు. నానో ప్లస్ యూరియాను అన్ని పంటలపై పిచికారీ చేయొచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో ఏఓలు కృష్ణ కుమార్, మాధవి, బోగ శ్రీనివాస్, ఏఈఓలు అశోక్, వినయ్‌కుమార్, విజయ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటుపై చిత్తశుద్ధి ఉందా?

- మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

నెక్కొండ : మండలంలోని నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసే విషయమై అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉందా? అని మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను విలీనం చేస్తే జనాభా 17 వేల 309కి చేరుతుందని తెలిపారు. నెక్కొండ, నెక్కొండ తండా, గుండ్రపల్లి, పత్తిపాక, అమీన్‌పేట, టీకేతండాలతో కలిసి మున్సిపాలిటీ ఏర్పాటుకు అధికారులే ప్రతిపాదనలు పంపించారని గుర్తు చేశారు. వాటితోపాటు మడిపల్లి, పనికర, కస్నాతండా, అప్పల్‌రావుపేట, ఆర్‌కే తండా 819 గ్రామాలను విలీనం చేసి ప్రభుత్వానికి నూతన ప్రతిపాదనలు పంపించాలని ఆయన కోరారు. ప్రతిపాదనలను రాజకీయ కోణంలో చూడకుండా మున్సిపాలిటీ కోసం నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో నాయకులు కాసు మల్లిఖార్జున్‌రెడ్డి, వడ్డే సురేశ్ పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న సుదర్శన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. మండలంలోని రేకంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఇజ్జగిరి రాజన్న, ఇజ్జగిరి కుమారస్వామి, తదితరులు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరగా వారికి సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. గతంలో తాను మంజూరు చేయించిన నిధులనే ఖర్చు చేస్తున్నాని తెలిపారు. ఎమ్మెల్యే అదనపు నిధులు తీసుకురాలేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, యూత్ నియోజకవర్గ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నాయకులు శంకేసి కమలాకర్, మేర్గు రాంబాబు, నీరటి మురళి, చొల్లేటి కొమురారెడ్డి, పింగిలి మోహన్‌రెడ్డి, ఇమ్మడి యుగందర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



నెక్కొండ : మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని నక్కలగుట్ట తండాలో వైద్యాధికారి అఖిల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అఖిల్ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సబ్ సెంటర్ల పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని చెప్పారు. శిబిరంలో వైద్యసిబ్బంది తోట పద్మ, అంగన్‌వాడీ టీచర్ భారతి, ఆశా వర్కర్లు అరుణ, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



ధర్నా చేస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ఆందోళన వెలిబుచ్చారు. ఆ పార్టీ నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అధ్యక్షతన ఆర్డీఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ సమస్యలను వివరించారు. వర్షాకాలంలో రైతులు, ప్రజలు సమస్యలతో సతమతమవుతుండగా ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, వంగల రాగసుధ, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు, నాయకులు నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉసిరి, నేరేడు, రవి, మద్ది, తదితర రకాలకు చెందిన సుమారు 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ మాట్లాడారు. విద్యార్థులు మొక్కలు నాటి దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జనార్దన్, అధ్యాపకులు అనూష, సుజాత, సుధారాణి, సవిత, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై నిర్లక్ష్యం



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం : గిరిజనుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బీకోజీనాయక్ తండా నుంచి బాలునాయక్ తండాకు వెళ్లే రోడ్డు కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతినగా ఆయన శుక్రవారం సందర్శించి పరిశీలించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనలోనూ వివక్ష కొనసాగుతోందని చెప్పారు. గిరిజనులు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. రైతులు నిత్యం ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, నాయకులు మహేందర్, శ్రీనివాస్, ముకుందం తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాల విఫలం

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు

పర్వతగిరి : రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు నెల రోజులుగా పర్వతగిరి, చౌటపల్లి సొసైటీల్లోని ప్రైవేటు ఫర్టిలైజర్ షాపుల వద్ద రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిల్చుంటున్న దుస్థితి నెలకొందని చెప్పారు. రైతు సమన్వయ కమిటీ మాజీ జిల్లా సభ్యుడు చింతపట్ల సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ మాజీ మంత్రి దయాకర్‌రావుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ సర్పంచ్‌లు ఏర్పుల శ్రీనివాస్, భానోతు వెంకన్న, పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు బరిగల విజయ, కోశాధికారి నరేశ్, నాయకులు దొమ్మటి రాజు తదితరులు పాల్గొన్నారు.

‘దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి’

గీసుకొండ : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ శ్రేణులను ఆ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ధర్మారావు కోరారు. మండలంలోని కోనాయిమాకుల, ఊకల్, మనుగొండ, చంద్రయ్యపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సమావేశాల్లో నాయకులు ప్రకాశ్, సిరిసె శ్రీకాంత్, అంకతి నాగేశ్వర్‌రావు, ముంత రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

టై, బెల్టుల అందజేత

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్‌రావు, సునీల్‌రావు చేతుల మీదుగా పిన్నంటి దశరథ రామారావు స్మారకార్థం ఆయన కుమారుడు నవీన్‌కుమార్ శుక్రవారం సుమారు రూ.50 వేల విలువైన టై, బెల్టులు, ఐడీ కార్డులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పాక రమేశ్ బాబు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు మహంకాళి రామస్వామి, పరశురాములు, మనోహర్, వెంకన్న, సుభాషిణి, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

‘ఇన్‌చార్జ్ కార్యదర్శితో ఇబ్బంది’

నర్సంపేట : ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శితో ఇబ్బందులు పడుతున్నామని జల్లి గ్రామానికి చెందిన నూనె భాస్కర్, యాట సుధాకర్, కొర్ర మోహన్, అంబాల ప్రవీణ్ తెలిపారు. ఆ గ్రామంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన మురికినీటిని, ఇతర సమస్యలను శుక్రవారం గ్రామస్తులు విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు పట్టాలివ్వాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. సదరు భూమిలో ఐదేళ్ల క్రితం పేదలు గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. ప్రభుత్వ భూముల్లో సర్వే చేపట్టి ఇళ్లు లేని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు పట్టాలిచ్చి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడెపాక మొగిలి, అల్లం రాజక్క, పాషా, కుక్కమూడి దుర్గయ్య, కల్తీ వీరస్వామి, సామంతుల మౌనిక, పెండ్యాల సరోజన, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

నర్సంపేట రూరల్ : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పలు సమస్యలపై తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేడ్కర్ మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కనబడడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద ఇళ్లు కడుతున్నారని చెప్పారు. అర్హులకు కాకుండా కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఇళ్లు మంజూరు చేయడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కుంభం కోమాల్‌రెడ్డి, గాదెగోని అనిల్, భట్టు మదన్, భూసాని సుదర్శన్, పురాని రమేశ్, గోలి యుగేంధర్, హర్షవర్ధన్, పుట్ట రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల జాతర సభలు



పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి, వడ్లకొండ, చింతనెక్కొండ, అన్నారం షరీఫ్, తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల జాతర సభలు శుక్రవారం నిర్వహించారు. వడ్లకొండలో లబ్ధిదారులకు పనుల మంజూరు పత్రాలను ఎంపీడీఓ శంకర్ నాయక్ అందజేశారు. ఎంపీడబ్ల్యూలను సన్మానించారు. గ్రామంలో నిర్మించిన పశువుల షెడ్డును ప్రారంభించారు. అనంతరం పర్వతగిరిలో నిర్వహించిన సభలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత పనుల కింద పశువుల షెడ్లు, తదితర పనులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ హారతి, డీఆర్‌డీఏ స్పెషల్ ఆఫీసర్ మోహన్, ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజు, టీఏ స్రవంతి, పంచాయతీ కార్యదర్శులు సునీల్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పిల్లల ఆస్పత్రి వార్షికోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్

నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేట రోడ్డులోని సంగీత పిల్లల ఆస్పత్రి 10వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ ఎర్ల రమేశ్ మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే పిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అహర్నిషలు కృషి చేస్తామన్నారు. పేదలు, అన్ని వర్గాల ప్రజలు ఆస్పత్రిలో లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

సుచరిత మృతిపై సమగ్ర విచారణ చేయించాలి

నర్సంపేట రూరల్ : నర్సంపేట సబ్ జైలు రిమాండ్ ఖైదీ సుచరిత మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలని ఎంఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథ్, జిల్లా ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సుచరిత కూతురు సుక్షితతో కలిసి శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ఉమారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుచరిత మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. జైలర్‌ను సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జాతీయ నాయకుడు వేల్పుల సూరన్న, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కళ్లెపల్లి ప్రణయ్‌దీప్, రాష్ట్ర నాయకులు తడుగుల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

‘సీఐటీయూ మహాసభను జయప్రదం చేయాలి’

దుగ్గొండి : ఈనెల 28న మండల కేంద్రంలో నిర్వహించనున్న సీఐటీయూ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు బోళ్ల కొమురయ్య కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి అన్యాయం చేసిందన్నారు. కార్మికులకు నష్టం కలిగించేలా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలను సవరించిందని తెలిపారు. జీపీ కార్మికుల మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభకు అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు, జీపీ కార్మికులు, గ్రామ సేవకులు, ఆశా కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు బొజ్జ సంపత్, ముక్కటి మహేందర్, తప్పెట్ల చిరంజీవి, జూలూరి భాస్కర్, గోర్కటి రమేశ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.